# బతుకమ్మ సంబురాలు షురూ


బాన్సువాడ బాలికల గురుకులంలో బతుకమ్మ సంబురాలు


లింగాపూర్ అంగన్‌వాడీ కేంద్రంలో..


దోమకొండలో..

కామారెడ్డి/మాచారెడ్డి/దోమకొండ, అక్టోబర్ 13: జిల్లాలోని పలు గ్రామాల్లో బతుకమ్మ సంబురాలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. జిల్లా కేంద్రంలోని విద్యానగర్ కాలనీలో బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. మహిళలు శివసాయి పార్కులో బతుకమ్మ ఆడారు. మున్సిపల్ పరిధిలోని లింగాపూర్ అంగన్‌వాడీలో బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. మాచారెడ్డి, దోమకొండ మండలాల పరిధిలోని ఆయా గ్రామాల్లో అందంగా పేర్చిన బతుకమ్మలతో వీధుల్లో ఆడిపాడారు. అనంతరం బతుకమ్మలను ఊరేగింపుగా తరలించి సమీప చెరువుల్లో నిమజ్జనం చేశారు.

**బాలికల గురుకులంలో..**

బాన్సువాడ టౌన్, అక్టోబర్ 13 : పట్టణ పరిధిలోని కొయ్యగుట్ట బాలికల గురుకులంలో బతుకమ్మ వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. వివిధ రకాల పూలతో బతుకమ్మలను అందంగా పేర్చారు. విద్యార్థులతో కలిసి ఉపాధ్యాయినులు బతుకమ్మ ఆడారు. వేడుకల్లో ప్రిన్సిపాల్ శోభారాణి, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

**ఎస్ఆర్ఎన్‌కే ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో..**

బాన్సువాడ రూరల్, అక్టోబర్ 13 : మండలంలోని శ్రీరాం నారాయణ్‌ఖేడియా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బతుకమ్మ సంబురాలను ఘనంగా నిర్వహించారు. తీరొక్క పూలతో విద్యార్థినులు, అధ్యాపకులు బతుకమ్మలను అందంగా అలంకరించారు. అనంతరం కళాశాల ప్రాంగణంలో బతుకమ్మలను ఏర్పాటుచేసి సంబరాలు నిర్వహించారు. ప్రిన్సిపాల్ గంగాధర్, వైస్ ప్రిన్సిపాల్ ముస్తాఫా, అధ్యాపకులు పాల్గొన్నారు.

భిక్కనూరు, అక్టోబర్ 13: భిక్కనూరు మండల కేంద్రంలోని చైతన్య పాఠశాలలో శుక్రవారం బతుకమ్మ సంబురాలు నిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థులు రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి ఆడిపాడి సందడి చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


జిల్లా కేంద్రంలోని శివసాయి పార్కులో బతుకమ్మ ఆడుతున్న మహిళలు


మాచారెడ్డి మండలం చుక్కాపూర్‌లో బతుకమ్మ ఆడుతున్న మహిళలు


బాన్సువాడ ఎస్ఆర్ఎన్‌కే డిగ్రీ కళాశాలలో బతుకమ్మ ఆడుతున్న విద్యార్థినులు

# మాదకద్రవ్యాల నిరోధానికి కలిసికట్టుగా కృషి చేయాలి

### కలెక్టర్ జితేశ్ వీ పాటిల్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ జితేశ్ వీ పాటిల్

కామారెడ్డి, అక్టోబర్ 13: మాదక ద్రవ్యాలు, మత్తు పదార్థాల నిరోధానికి ప్రతి ఒక్కరూ కలిసికట్టుగా కృషి చేయాలని కలెక్టర్ జితేశ్ వీ పాటిల్ అన్నారు. కలెక్టరేట్‌లోని ఎన్నికల విభాగం కంట్రోల్ రూమ్‌లో అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. యువత మత్తు పదార్థాలకు బానిస కాకుండా చూడాలని, ఇందుకోసం కళాశాలల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. సమాజానికి పెను ప్రమాదంగా మారిన మాదక ద్రవ్యాలపై ఉక్కు పాదం మోపేందుకు సంబంధిత శాఖలు సమన్వయంతో పని చేయాలన్నారు. మత్తు పదార్థాలు, మాదక ద్రవ్యాలకు అలవాటుపడినవారు వ్యక్తిగతంగా కుటుంబ పరంగా నష్టపోతారని అన్నారు. మాదక ద్రవ్యాల నియంత్రణ కోసం పోలీసు, ఆబ్కారీ, మహిళా శిశు సంక్షేమం తదితర శాఖలు చిత్తశుద్ధితో కృషిచేయాలని సూచించారు. మత్తు పదార్థాలకు బానిసలైన వారికి కౌన్సిలింగ్ ఇచ్చి పూర్వస్థితికి తేవాలని,వారికి పునరావాసం కల్పించాలన్నారు. సమావేశంలో ఆబ్కారీ సూపరింటెండెంట్ రవీంద్ర రాజు, పోలీసు అధికారులు, డీఆర్డీవో సాయన్న, జిల్లా సంక్షేమాధికారి బావయ్య తదితరులు పాల్గొన్నారు.

# వాహనదారులు హెల్మెట్ ధరించాలి

రామారెడ్డి, అక్టోబర్ 13: రామారెడ్డి మండలంలోని గొల్లపల్లి క్రాస్ రోడ్డు వద్ద ఏఎస్సై సుభాషిణి ఆధ్వర్యంలో శుక్రవారం వాహనాలను తనిఖీ చేశారు. హెల్మెట్ లేకుండా వాహనాలు నడుపుతున్న వారికి జరిమానా విధించారు. ఈ సందర్భంగా ఏఎస్సై మాట్లాడుతూ.. వాహనదారులు మద్యం సేవించి వాహనాలను నడుపరాదన్నారు. ద్విచక్రవాహనదారులు కచ్చితంగా హెల్మెట్ ధరించాలని సూచించారు. తనిఖీల్లో పోలీసులు లక్ష్మీకాంత్, బాబయ్య, శేఖర్, సంపత్, మధు తదితరులు పాల్గొన్నారు.

# ఆకర్షణీయమైన ప్రకటనలకు మోసపోవద్దు


ఎల్లారెడ్డి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు షీటీం పనితీరుపై అవగాహన కల్పిస్తున్న ప్రతినిధులు

ఎల్లారెడ్డి రూరల్, అక్టోబర్ 13: ఉచితంగా వచ్చేవాటికి, ఆకర్షణీయమైన ప్రకటనలకు మోసపోవద్దని షీ టీం సభ్యుడు శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం ఎల్లారెడ్డి పట్టణంలోని జూనియర్ కళాశాలలో షీటీం పనితీరు, సైబర్ క్రైంపై విద్యార్థులకు శుక్రవారం అవగాహన కల్పించారు. మహిళా భద్రతకు మార్గదర్శకులుగా నిలుస్తూ, మహిళలకు పూర్తిగా సురక్షితమైన పరిస్థితిని కల్పించాలనే ఉద్దేశంతో రాష్ట్రప్రభుత్వం షీ టీం వ్యవస్థను ఏర్పాటుచేసిందని తెలిపారు. విద్యార్థినులపై వేధింపులు, మహిళల పట్ల అసభ్యకరంగా ఎవరైనా ప్రవర్తిస్తే వారిని అరెస్ట్ చేసి చట్టప్రకారం శిక్షించడానికి షీటీంలు ఏర్పాటైనట్లు చెప్పారు. విద్యార్థులు సైబర్ క్రైంపై అవగాహన కలిగి ఉండాలని, ఆకర్షణీయమైన, అత్యధికంగా లాభాలు అంటూ మొబైల్‌లో వచ్చే ప్రకటనలు చూసి మోసపోవద్దని సూచించారు. కార్యక్రమంలో షీటీం సభ్యురాలు సుప్రజ, కళాబృందం సాయిలు, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ఓటు హక్కు వినియోగంపై అవగాహన కల్పించాలి


బీఎల్వోల సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ హిమబిందు

సదాశివనగర్, అక్టోబర్ 13 : ఓటు హక్కు వినియోగంలోపై వృద్ధులు, దివ్యాంగులకు వారి ఇండ్లకు వెళ్లి అవగాహన కల్పించాలని తహసీల్దార్ హిమబిందు అధికారులకు సూచించారు. ఇంటి నుంచి ఓటు వేయడానికి సంబంధించిన ప్రొఫార్మా అందించి వివరాలను సేకరించాలన్నారు. మండల కేంద్రంలోని రైతు వేదిక భవనంలో బీఎల్వోలతో శుక్రవారం సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. ఎన్నికల సమయంలో వృద్ధుల ఓటు హక్కు వినియోగంపై ముందుగానే ప్రొఫార్మా తయారుచేసినట్లు తెలిపారు. ప్రతి గ్రామంలో బీఎల్వోలు ఓటరు జాబితా ప్రకారం ఇంటికి వెళ్లి వారి కుటుంబ సభ్యులకు ప్రొఫార్మ అందించాలని సూచించారు. పోలింగ్ కేంద్రాల్లో వసతులపై ఎప్పటికప్పుడు వివరాలను తహసీల్ కార్యాలయంలో అందజేయాలన్నారు. సమావేశంలో రెవెన్యూ శాఖ సీనియర్ అసిస్టెంట్ వేణు, సూపర్ వైజర్ రాజు, బీఎల్వోలు స్వామి, రాజు, రమేశ్, రాజేందర్, భూమాలింగం, జ్యోతి, శ్రీలత, దీప, పాపిరెడ్డి, ప్రవీణ్, దేవీసింగ్, శ్రీనివాస్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు

# విత్తనాలు, ఎరువుల దుకాణాల్లో తనిఖీలు


ఉత్తునూర్‌లో విత్తనాల దుకాణంలో తనిఖీలు చేస్తున్న ఎల్లారెడ్డి ఇన్‌చార్జి ఏడీఏ శ్రీకాంత్

సదాశివనగర్, అక్టోబర్ 13: మండలంలోని వివిధ గ్రామాల్లో విత్తనాలు, ఎరువుల దుకాణాల్లో ఎల్లారెడ్డి ఇన్‌చార్జి ఏడీఏ శ్రీకాంత్ ఆధ్వర్యంలో వ్యవసాయ అధికారులు శుక్రవారం తనిఖీ లు నిర్వహించారు. స్టాక్ వివరాల రికార్డులు, ఎరువులు, విత్తనాల తయారీ తేదీలను పరిశీలించారు. కాలపరిమితి దాటిన విత్తనాలు, ఎరువులను వెంటనే దుకాణం నుంచి తీసివేయాలన్నారు. ఉత్తునూర్, పద్మాజివాడి ఎక్స్ రోడ్డు, సదాశివనగర్ మండల కేంద్రంలో తనిఖీ చేపట్టినట్లు ఏడీఏ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులకు విత్తనాలు, ఎరువుల వ్యాపారులు నాణ్యమైన, ప్రభుత్వ గుర్తింపు పొందిన విత్తనాలు, ఎరువులను విక్రయించాలన్నారు. కల్తీ, నకిలీ విత్తనాలు, ఎరువులు అమ్మితే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. రైతులకు ఎరువులు, విత్తనాలు అమ్మిన సమయంలో తప్పకుండా రసీదులు ఇవ్వాలన్నారు. తనిఖీల్లో సదాశివనగర్ మండల వ్యవసాయ అధికారి ప్రజాపతి, రామారెడ్డి ఏవో హరీశ్ తదితరులు పాల్గొన్నారు.

# శబరిమాతాజీ ఆశ్రమంలో పల్లకీ సేవ

తాడ్వాయి, అక్టోబర్ 13 : మండల కేంద్రంలోని సద్గురు శ్రీశబరిమాతాజీ ఆశ్రమంలో పల్లకీసేవ వైభవంగా నిర్వహించారు. ఆశ్రమానికి వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన మాతాజీ భక్తులు గురువారం రాత్రి పాదుకా పూజోత్సవం, పల్లకీ సేవా కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. అర్ధరాత్రి వరకు అనంతరం భజన కార్యక్రమాలు కొనసాగాయి. ఆశ్రమ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు ఏర్పాట్లు చేశారు.